క్లుప్తంగా

నల్లబ్యాడ్జీతో విధులకు హాజరు


ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: అన్నమయ్య జిల్లా, గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిని నిరసిస్తూ విజయనగరం ఉమ్మడి జిల్లాల ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు శంబంగి రామకృష్ణ నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం విధులకు హాజరయ్యారు. ఇటువంటి దౌర్జన్యాలను అరికట్టాలని, విధుల్లోని ఉద్యోగులపై భౌతికదాడికి పాల్పడిన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లల బోధనకు అవసరమైన పీపీ-1, పీపీ-2 పుస్తకాలను పెరుమాళిలో జరిగిన ఐసీడీఎస్ సెక్టార్ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం పంపిణీ చేశారు. పెరుమాళి సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో పీవో కె.రాజ్యలక్ష్మి వీటిని కార్యకర్తలకు అందజేశారు.

పరీక్షల భయం పోగొట్టాలి


మాట్లాడుతున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

వంగర: విద్యార్థుల్లోని పరీక్షల భయం పోగొట్టాలని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎంఆర్‌సీలో హెచ్‌ఎంల సమావేశం శనివారం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల భయం వీడేలా చర్యలు తీసుకోవాలని, ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించాలి


బొబ్బిలిరూరల్: తహసీల్దారు శ్రీనుకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ వసుంధర

రామభద్రపురం/బొబ్బిలిరూరల్/బాడంగి/రాజాం: మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులకు రైతులు పెద్దఎత్తున హాజరై, వారి భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులంతా ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతులు సమర్పించిన అర్జీల్లో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వేంకటేశ్వరునికి పూలంగి సేవ



బొబ్బిలి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని కంచర వీధిలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన స్వామి వారికి శనివారం పూలంగి సేవ చేపట్టారు. వేంకటేశ్వరుడితో పాటు విష్ణుమూర్తి, ఆంజనేయుడు, శ్రీకృష్ణుడు విగ్రహాలను పూలతో అందంగా అలంకరించారు.

సక్రమంగా సోషల్ ఆడిట్ చేయాలి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు

రేగిడి: మండలంలో 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా నిర్వహించనున్న సోషల్ ఆడిట్ సక్రమంగా చేయాలని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీల బృందంతో శనివారం సమావేశమైన వారు.. అందరినీ సమన్వయం చేస్తూ తనిఖీలు చేయాలని, అక్రమాలు గుర్తించాలని, నివేదికల ద్వారా ప్రజావేదికల్లో వాటిని తెలియజేయాలని, అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ కె.మన్మధరావు, ఏపీవో హరనాథరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తెర్లాం: మండలంలోని సింగిరెడ్డివలస, సీతారాంపురం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు సర్పంచ్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోరుబావులు, సోలార్ మంచినీటి పథకం మరమ్మతులు శనివారం చేపట్టి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

సంక్షోభంలో ఇటుక పరిశ్రమ

- భారీగా తగ్గిన ఇటుకల వ్యాపారం
- తుపాను వర్షాలతో అతలాకుతలాం
- ప్రతికూల వాతావరణంతో మందగించిన తయారీ
- నిర్మాణాలు లేక అమ్ముడవ్వని ఇటుకలు
- ఆందోళనలో బట్టీ యజమానులు, కూలీలు


రేగిడి మండలంలోని కుమ్మరి అగ్రహారం వద్ద తడిచిన ఇటుకలను ఆరబెట్టిన దృశ్యం

రాజాం: ఇటుక పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. తయారైన ఇటుకలు అమ్ముడవ్వక.. కొత్త ఇటుకల తయారీకి వాతావరణం అనుకూలించక.. ఇటుకల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పనుల్లేక కూలీలు.. ఇటుకలు అమ్ముడుపోక బట్టీ యజమానులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రధానంగా ఇటీవల తుపాను వర్షాలు, నిర్మాణాలు అంతగా జరగకపోవడం వంటి వాటితో వ్యాపారం వెలవెలబోయిందని బట్టీ యజమానులు వాపోతున్నారు. ఇదివరకే తయారు చేసిన ఇటుకలు అమ్ముడుపోవడం లేదని, కొత్తవి తయారు చేద్దామంటే నిర్మాణాలు జరగక ఆర్డర్లు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమను కొనసాగించాలా.. మధ్యలోనే వదిలేయాలా అనే సందిగ్ధంలో వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు.

గతంలో పుట్టగొడుగుల్లా బట్టీలు..

మట్టి ఇటుకల తయారీ పరిశ్రమ.. నిన్నమొన్నటి వరకు మూడు ఇటుకలు.. ఆరు బట్టీలు.. అన్న చందంగా ఉండేది. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో తొమ్మిది నెలల క్రితం వరకు పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు(పరిశ్రమలు) పుట్టుకొచ్చాయి. ఒక్కో బట్టీ వద్ద నాలుగు నుంచి ఐదు కుటుంబాలు జీవనం సాగించేవి. ఏటా ఇటుకల ధరలు పెరుగుతూ వచ్చేవి. వేసవితో పాటు అన్ని కాలాల్లోనూ వీటి సీజన్ నడిచేది. మట్టి ఆధారంగా తయారైన ఇటుకలకు డిమాండ్ కూడా ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. గత కొంతకాలంగా ఇటుకల వ్యాపారం మందగించింది. ఇటుకలు కొనే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా వాటి ధరలు పతనమయ్యాయి.

-రూ.10 వేల నుంచి రూ.7 వేలకు..

గతంలో ట్రాక్టరు లోడు ఇటుక(2000) ధర రూ.10 వేలు ఉండేది. రవాణా చార్జీలు అదనంగా రూ.1500 నుంచి రూ.2500ల వరకు ఉండేవి. రాజాం మండలంలోని పొగిరి, కొత్తపేట, పెనుబాక, పొగిరి తదితర ప్రాంతాల్లో ఇటుకకు మంచి డిమాండ్ ఉండేది. రేగిడి మండలంలోని కుమ్మరి అగ్రహారం, తాటిపాడు, లక్ష్మణవలస, ఖండ్యాం ప్రాంతాల వద్ద ఇటుక తయారీ అధికంగా ఉండడంతో పాటు తరలింపు కూడా ఎక్కువగా ఉండేది. సంతకవిటి మండలంలోని రంగారాయపురం, మేడమర్తి, పోడలి, తాలాడ ప్రాంతాల్లోనూ ఇటుక బట్టీలకు మంచి డిమాండ్ నడిచింది. ఇటుక ధరల్లో తగ్గేది లేదన్నట్లుగా వ్యాపారులు విక్రయాలు చేసేవారు. ఇప్పుడు ఆయా ప్రాంతాల్లోని ఇటుక పరిశ్రమలు బాగా నడవడం లేదు. ట్రాక్టరు ఇటుక ధర ఒక్కసారిగా రూ.10 వేల నుంచి రూ.7,500, రూ.8 వేలకు పడిపోయింది. కొన్ని పరిశ్రమల వద్ద అయితే ఇటుకలు కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. నిర్మాణాలు అంతగా లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. ఫలితంగా నెలల తరబడి ఇటుకల విక్రయాలు జరగకపోవడంతో పెట్టిన పెట్టుబడి వడ్డీలు చెల్లించలేక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఇటీవల తుపాను వర్షాలకు ఇటుక బట్టీలు తడిసిముద్దయ్యాయి. మట్టి ఇటుకలే కావడంతో ముద్దయిన ఇటుకలు నేలలోనే కలిసిపోతున్నాయి. లక్షలాది రూపాయల పెట్టుబడితో పెట్టిన ఇటుకల వ్యాపారం.. నేడు దివాలా తీసే పరిస్థితి కనిపిస్తోంది. రాజాం నియోజకవర్గం వ్యాప్తంగా 210కి పైగా ఇటుక పరిశ్రమలు ఉన్నాయి.


రాజాం మండలంలోని పొగిరి దగ్గరలో ఇటుక బట్టీలు

నష్టాలు చవిచూస్తున్నాం..

మండలంలో ఓ గ్రామం వద్ద రూ.10 లక్షల పెట్టుబడి పెట్టి నాలుగు ఇటుక బట్టీలు పెట్టాం. గత కొంతకాలంగా ఇటుకల వ్యాపారం పడిపోయింది. పెట్టిన పెట్టుబడికి వడ్డీలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఇటీవల వర్షాలకు ఉన్న ఇటుకలను కూడా నష్టపోయే ప్రమాదం కనిపిస్తోంది.

– కె.రామయ్య, ఇటుకల వ్యాపారి, రాజాం

ధరలు పతనం..

ఇటుకల ధరలు పతనమయ్యాయి. పెట్టుబడి మాత్రం అధికంగా ఉంది. గతంలో మా బట్టీల వద్ద ట్రాక్టరు లోడు ఇటుక రూ.12 వేల నుంచి రూ.12,500లకు విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. ముందుగా అడ్వాన్స్‌లు చెల్లించి, పట్టుకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి తలకిందులైంది. ధర తగ్గించి మరీ అమ్మాల్సి వస్తోంది.

ఎం.రామారావు, ఇటుకల తయారీదారు, సంతకవిటి మండలం

పల్లెపండుగ పనులు పూర్తి చేయాలి


తెర్లాం: పెరుమాళిలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ అప్పారావు

తెర్లాం: పల్లె పండుగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్ డీఈఈ అప్పారావు సూచించారు. మండలంలోని సుందరాడ, పెరుమాళి తదితర గ్రామాల్లో పల్లె పండుగ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ఆయన శనివారం పరిశీలించారు. చాలాచోట్ల ప్రారంభించాల్సిన పనులను నిర్దేశిత గడువులోగా ప్రారంభించకపోతే రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మండలానికి మంజూరైన రూ.7 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. టెండర్ కోడ్ దక్కించుకున్న వారంతా వెంటనే పనులు ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మండల ఇంజినీరింగ్ అధికారి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను పర్యవేక్షించాలని తెలిపారు. ఆయన వెంట ఏఈ వాసిరెడ్డి సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

నాణ్యత లేని పనులు..

మెంటాడ: నాణ్యత లేకుండా పల్లెపండుగ పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు గేదెల రామకృష్ణ ఆరోపించారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు కనీసం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేసేస్తున్నారని, అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతూ నిబంధనలు తుంగలోకి తొక్కేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని జేఈఈ గౌతమ్‌ను కోరారు.

కేంద్రమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై బొబ్బిలి సీఐటీయూ కార్యాలయంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావులు శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి, ఆయన రాజ్యసభలో అవమానకరంగా మాట్లాడిన తీరు విచారకరమన్నారు. అంబేడ్కర్ జపం చేయడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిపోయిందని, ఆ జపమేదో దేవుడిని తలచుకుని చేస్తే స్వర్గమైనా లభించేదని ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ వాదులు, ప్రజాతంత్ర వాదులు వ్యతిరేకిస్తున్నారన్నారు. అమిత్ షా వైఖరిని నిరసిస్తూ ఈ నెల 30వ తేదీన బొబ్బిలిలో నిరసన చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



విజయనగరంలో 2025 జనవరి 5న చేపట్టే మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు జరజాన సింహాచలం కోరారు. ఇదే విషయమై ఆయన సంతకవిటి మండల కేంద్రంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టే ఈ కార్యక్రమంలో దళితులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీలను వేరుచేసే కుట్ర నేపథ్యంలోనే వర్గీకరణ అంశం తెరపైకి తీసుకువచ్చారని, దీనిని మనమంతా ఖండించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మాదిగ సోదరులు కూడా ఈ విషయం గుర్తెరగాలన్నారు. – వంగర

బేకరీ షాపులో విజిలెన్స్ దాడులు



రాజాంలోని పాలకొండ రోడ్డులో ఉన్న రవి బేకరీ షాపులో విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఫుడ్ అండ్ సేఫ్టీ, తూనికలు కొలతలు శాఖ, లేబర్, రెవెన్యూ అధికారులంతా మూకుమ్మడిగా సోదాలు చేశారు. ఎక్కువ కాలం నిల్వ ఉన్న పదార్థాలు ఉన్నట్లు గుర్తించి, వాటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. అలాగే కమర్షియల్ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి, ఏడు సిలిండర్లు సీజ్ చేశామని ఆర్ఐ విద్యాసాగర్ తెలిపారు. లేబర్ చట్టం ప్రకారం ధ్రువపత్రాలు లేకపోవడంతో కేసు కూడా నమోదు చేశామని లేబర్ అధికారి కొండలరావు అన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి పి.వెంకటరమణ, తూనికలు కొలతలు శాఖ అధికారి ఎ.బాలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. – రాజాం సిటీ

2025 నాటికి క్షయ రహిత సమాజం



క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

రేగిడి: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి చలమయ్య కోరారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని బూరాడ, తాటిపాడు తదితర గ్రామాల్లోని ప్రజలకు క్షయవ్యాధి నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. 2025 నాటికి క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజింగ్ కన్సల్టెంట్ డాక్టర్ డేని, టెక్నికల్ అధికారి వెంకటనాయుడు, ఎంపీహెచ్‌వో రాధాకృష్ణ, క్షయ వ్యాధి నిర్మూలన సూపర్‌వైజర్ వేణుగోపాలరావు, సీహెచ్‌వో శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని పెరుమాళి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ ఉషారాణితో కలిసి ఆమె శనివారం సందర్శించి, పిల్లల హాజరు, పౌష్టికాహారం, స్టాక్ నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలిపారు.

ఆదాయ సర్వేను వేగవంతం చేయాలి


సిబ్బందితో సమీక్షిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జీ ఆదాయ సర్వేను వేగవంతం చేయాలని వెలుగు రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సిబ్బందికి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాల్లోని సీసీలు, ఏపీఎంలతో క్లస్టర్ స్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం కోసం ఏర్పాటు చేసిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రారంభ దశ నుంచి ఇప్పటివరకు ఎంతమేర సఫలీకృతమైందోనన్న విషయంపై మిగిలిన సర్వేను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సంఘ సమావేశాలకు సిబ్బంది తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్, ఫైనాన్స్ ఏపీఎం కె.హేమలత, ఎఫ్‌పీఓ ఏపీఎం టి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

133.5 హెక్టార్లలో పంటనష్టం


కారాడలో నేలమట్టమైన మొక్కజొన్న పంట

బొబ్బిలిరూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల తుపాను వర్షాలకు 133.5 హెక్టార్లలోని మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు రైతులు వాపోతున్నారు. రామభద్రపురం మండలంలోని 134 మంది రైతులకు చెందిన 134 ఎకరాల్లోని పంట అంతా నాశనం కాగా బొబ్బిలి మండలంలోని కలవరాయి, అలజంగి గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులకు చెందిన 10.5 హెక్టార్లలోని మొక్కజొన్న నేలకూలింది. ఇలా చాలాచోట్ల పంటనష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతాంగం కోరుతోంది. ఇదే విషయమై ఏడీ శ్యామసుందర్‌ను వివరణ కోరగా, ఎకరా మొక్కజొన్న పంటకు రూ.2 వేల నష్టపరిహారం అందజేస్తోందన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాజాం సిటీ: నిరుద్యోగ యువత నుంచి మెప్మా ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బ్యూటీషియన్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్‌తో పాటు పలు రకాల సేవల్లో ఎన్ఎస్‌డీసీ, ఎస్‌డీసీ, ఎన్ఏసీ సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఈ నెల 31వ తేదీలోగా మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు జనవరి 17న రిజిస్ట్రేషన్ ఉంటుందని, అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 8074239031, 8074200817, 8074218784ను సంప్రదించాలని కోరారు.

బొబ్బిలి: పట్టణంలో మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శనివారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

త్వరితగతిన సర్వేలు పూర్తి చేయాలి

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న వివిధ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం, సోపేరు గ్రామ సచివాలయాలను ఆయన శనివారం సందర్శించి, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, ఎంఎస్ఎంఈ సర్వే, పీపీసీఎస్ ఈకేవైసీ, హౌస్‌హోల్డ్ జియో సర్వేపై సమీక్షించారు. ఈ సర్వేలన్నీ వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు.

ఇంటింటా కులగణన చేపట్టాలి

వంగర: ఎస్సీ కులగణన ఆడిట్ వెంటనే నిలుపుదల చేసి, ఇంటింటా కులగణన చేపట్టాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలో మానవహారం శనివారం చేపట్టారు.

ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న కులగణన తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. పక్కాగా కులగణన జరగాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మజ్జి గణపతి, ఎం.గణపతిరావు, చిత్తిరి గంగులు తదితరులు పాల్గొన్నారు.


మానవహారంగా ఏర్పడిన దళిత సంఘాల నాయకులు

వ్యక్తిపై దాడి

రాజాం సిటీ: స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద శనివారం ఓ వ్యక్తిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. సారధికి చెందిన శ్యామసుందరరావుపై గురవాం గ్రామానికి చెందిన నవీన్, తేజ, మురళి, పెనుబాక గ్రామానికి చెందిన ఫణీంద్ర, రాజాంకు చెందిన రాజు మరో ఇద్దరు కలిసి దాడి చేశారన్నారు. ఈ దాడిలో గాయపడిన వ్యక్తిని స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా, రాజాంలో తరచూ గ్యాంగ్ దాడులు జరగడం పరిపాటిగా మారిందని, పోలీసులు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి

బాడంగి: పంటలకు సంబంధించి, బీమా నమోదు చేయించుకోవాలని ఏవో శిరీష సూచించారు. రబీ సీజన్‌లో సాగు చేస్తున్న మొక్కజొన్న, మినప, పెసర, ధాన్యం పంటలకు బీమా చేయించుకోవాలని, బీమా సదుపాయం ఉంటే పంట నష్టపరిహారం అందుతుందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రీమియం చెల్లించి, బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు.